క్లుప్తంగా

రూ. 19.98 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం



పాయకాపురం (విజయవాడ రూరల్): గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 19.98 లక్షలతో 62వ డివిజన్‌లోని మూడు ప్రాంతాల్లో సిమెంటు రోడ్లు నిర్మించినట్లు ఇంజినీరింగ్ అసిస్టెంట్ కె.నవీన్ తెలిపారు. మూడు రోడ్ల నిర్మాణంలో భాగంగా గురువారం ప్రకాష్ నగర్‌లోని శానిటరీ కార్యాలయం వద్ద పల్లంగా ఉండే రోడ్డును మెరక చేసి నిర్మించారు. వర్షాలు కురిసినప్పుడల్లా వర్షం నీరు రోడ్డుపై నిలబడి రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుందని ఆ ప్రాంత ప్రజలు ఎమ్మెల్యే మల్లాది విష్ణు నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తెలియజేశారు. ఈ నేపథ్యంలో రోడ్డు నిర్మించడం జరిగిందని ఇంజినీరింగ్ అసిస్టెంట్ నవీన్ పేర్కొన్నారు.

61వ డివిజన్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష

పాయకాపురం(విజయవాడ రూరల్): జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరం 61వ డివిజన్ 257వ సచివాలయం పరిధిలోని అయితా రాములు ఎలిమెంటరీ స్కూల్ నందు గురువారం జరిగింది. ఈ వైద్య శిబిరంలో 423 మందికి వివిధ వ్యాధులకు సంబంధించిన ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. వైద్య శిబిరంలో డాక్టర్లు బి.నరేంద్రనాయక్, డాక్టర్ మాధవీలత, డాక్టర్ ఆకాష్, ఎఆర్‌ఎస్ కోటిరత్నం, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెనికలపాటి సేవలకు గుర్తింపు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అగ్నిమాపక శాఖలో అత్యుత్తమ సేవలు అందించిన డైరెక్టర్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్ పెనికలపాటి వెంకటరమణకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి అత్యున్నత పురస్కారం ప్రెసిడెంట్ ఫైర్ సర్వీస్ మెరిటోరియస్ మెడల్ ప్రకటించింది. శుక్రవారం జరిగే రిపబ్లిక్ డే వేడుకల్లో మెడల్‌ను వెంకటరమణ అందుకోనున్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇందిరా మహిళా మండలి వార్షికోత్సవం, గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా 30వ డివిజన్ రామకృష్ణాపురంలో గురువారం మహిళల ఆటలు, రంగవల్లుల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఆటల పోటీల్లో మహిళలు పాల్గొని వారిలోని ప్రతిభాపాటవాలను ప్రదర్శించారు. క్యారమ్స్, క్యాచ్‌బాల్, లెమన్ స్పూన్ పోటీలలో మహిళలు చురుగ్గా పాల్గొన్నారు. అలాగే రంగవల్లుల పోటీలలో వారిలోని సృజనాత్మకతకు అద్దం పట్టేలా రంగవల్లులను తీర్చిదిద్దారు. పోటీలలోని విజేతలకు శుక్రవారం ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేస్తామని మహిళా మండలి అధ్యక్షురాలు కే మాధవీలత తెలిపారు.

శ్రీదత్తసాయి మందిరంలో అన్నప్రసాద వితరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): వనపుతోట శ్రీదత్తసాయి మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శ్రీసాయి నక్షత్రమాలిక మండలి ఆధ్వర్యాన పారాయణం చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం దాతల సహకారంతో అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను మందిర వ్యవస్థాపకుడు తంగెళ్ళమూడి వీరమోహనరావు పర్యవేక్షించారు.

29న సంకట చతుర్థి వేడుకలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీధర్మ పరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన 29వ తేదీ సోమవారం సంకట చతుర్థి వేడుకలు నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయగణపతి స్వామివారికి సాయంత్రం 5.30 గంటలకు రుద్రాభిషేకం, అర్చన హారతి మంత్ర పుష్ప తీర్థ ప్రసాద వితరణ జరుగుతాయని పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాల్సిందిగా ఆయన కోరారు.

ప్రారంభోత్సవానికి తరలివెళ్లిన నేతలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలో గురువారం జరిగిన వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ కార్యాలయం ప్రారంభోత్సవానికి 30వ డివిజన్ నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా తరలివెళ్లారు. వైఎస్సార్ సీపీ జెండాలను చేతబూని 'జై జగన్.. జైజై జగన్' అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీగా సెంట్రల్ పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు.

జిల్లాలో వైఎస్సార్ సీపీ క్లీన్‌స్వీప్ తథ్యం

- విజయవాడ నగరం వైఎస్సార్ సీపీ కంచుకోటగా కానుంది
- విజయవాడ ఎంపీ కేశినేని నాని



సభలో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని నాని

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రానున్న ఎన్నికల్లో విజయవాడ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ క్లీన్‌స్వీప్ చేయనుందని, విజయవాడ నగరం వైఎస్సార్‌సీపీ కంచుకోటగా అవతరించనుందని విజయవాడ ఎంపీ కేశినేని నాని ధీమా వ్యక్తం చేశారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమం సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలో గురువారం ఘనంగా జరిగింది. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రి జోగి రమేష్, రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్యేలు పేర్ని నాని, మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, ఎండీ రుహుల్లాతో కలిసి ఈ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపీ కేశినేని నాని మాట్లాడుతూ గత ఎన్నికల్లో 25 ఓట్ల మెజార్టీతో ఎమ్మెల్యేగా మల్లాది విష్ణు విజయం సాధించారని, కానీ ఈసారి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇక్కడకు వచ్చిన ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ ఏకంగా 25 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించి తీరుతారన్నారు. చంద్రబాబుది అంతా స్వార్థ రాజకీయమేనని, తరతరాలు తామే ఏలాలి, తన కొడుకును ముఖ్యమంత్రిని చేయాలనే తప్ప రాష్ట్ర అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోరని ఆరోపించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేద ప్రజలకు నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందించడంతో పాటు సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. మాట ఇస్తే మోసం చేసే వ్యక్తి చంద్రబాబు అని, మాట ఇస్తే నిలబెట్టుకునే వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. సెంట్రల్ నియోజకవర్గంలో భూకబ్జా దారుడు, బ్లాక్ మెయిలర్, స్వాతంత్ర్య సమర యోధుల భూములను సైతం కాజేసిన బొండా ఉమాలాంటి వ్యక్తికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

జిల్లాలో గెలిచే తొలి సీటు సెంట్రలే : మల్లాది విష్ణు

జిల్లాలో వైఎస్సార్ సీపీ గెలిచే మొట్టమొదటి సీటు విజయవాడ సెంట్రల్ నియోజకవర్గమేనని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. వెలంపల్లి శ్రీనివాస్ గెలుపునకు తన పూర్తి సహకారం ఉంటుందని, జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులు వైఎస్సార్ సీపీ విజయానికి తోడ్పడతాయని చెప్పారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు జూపూడి ప్రభాకర్, తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్, ఫైబర్ నెట్ కార్పొరేషన్ చైర్మన్ పూనూరు గౌతమ్‌రెడ్డి, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ షేక్ ఆసిఫ్, డెప్యూటీ మేయర్లు అవుతు శ్రీశైలజ, బెల్లం దుర్గ తదితరులు హాజరయ్యారు.

సంబరంగా ప్రారంభోత్సవం..

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ కార్యాలయ ప్రారంభోత్సవం సంబరంగా సాగింది. నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల నుంచి పార్టీ శ్రేణులంతా ర్యాలీలుగా రావడంతో సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీ ప్రాంతాలన్నీ వైఎస్సార్ సీపీ జెండాలతో కళకళలాడుతూ కనిపించాయి. ఎమ్మెల్యే మల్లాది విష్ణు కార్యాలయం నుంచి కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలతో ర్యాలీగా విచ్చేశారు. ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ షేక్ ఖాజా, నాయకులు డ్యాన్సులు వేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్లు బీ జానారెడ్డి, ఎండీ షాహీనాసుల్తానా, ఇసరపు దేవి, ఉమ్మడి రమాదేవి, మోదుగుల తిరుపతమ్మ, యరగొర్ల తిరుపతమ్మ, శర్వాణీ మూర్తి, బాలిగోవింద్, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వీఎంసీ బడ్జెట్‌పై కమిషనర్ సమీక్ష



బడ్జెట్‌పై సమీక్షిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, పాల్గొన్న అధికారులు

పటమట(విజయవాడతూర్పు): ప్రజల శ్రేయస్సే ప్రధాన ధ్యేయంగా, నగరాభివృద్ధే లక్ష్యంగా 2024–25 ఆర్థిక ఏడాదికి వీఎంసీ బడ్జెట్ ఉండాలని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. గురువారం ఆయన వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో అన్ని శాఖల అధికారులతో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 2024–2025 సంవత్సరపు అంచనాలు అభివృద్ధికి ప్రతీకగా ఉండాలని స్పష్టం చేశారు. వివిధ శాఖల్లో కేటాయించిన బడ్జెట్ రాబోవు కాలానికి అవసరమైన బడ్జెట్ గురించి చర్చించారు. అధికారులకు నగరాభివృద్ధిపై తగు సూచనలు చేసి, ప్రజా ప్రయోజనాల గురించి అవసరమయ్యే పనులకు తగిన బడ్జెట్ ప్రతిపాదనలతో మరోసారి సమీక్ష సమావేశంలో నివేదికను తనకు అందించాలని ఆదేశించారు.

శ్రీనివాసరాజు సాహిత్యసేవలు వెలకట్టలేనివి



మాట్లాడుతున్న కొల్లూరి, వేదికపై అంజనేయరాజు, సీహెచ్‌వీ సుబ్బయ్య తదితరులు

విజయవాడ కల్చరల్: సత్య శ్రీనివాసరాజు సాహిత్య సేవలు వెలకట్టలేనివని ఎక్స్‌రే సాహిత్య సేవా సంస్థ అధ్యక్షుడు కొల్లూరి అన్నారు. అమ్మ కల్చరల్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు, రచయిత, సమాజ సేవకుడు శ్రీనివాసరాజు సంతాప సభను గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయం మినీ హాల్‌లో గురువారం నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన కొల్లూరి మాట్లాడుతూ శ్రీనివాసరాజుకు, ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థకు విడదీయలేని అనుబంధం ఉందని తెలిపారు. ఎక్స్‌రే ప్రధాన కార్యదర్శి బోడి అంజనేయరాజు మాట్లాడుతూ అమ్మ సాంస్కృతిక కేంద్రం ద్వారా ఐదు వందలకు పైగా నృత్య కార్యక్రమాలను రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో నిర్వహించినట్లు పేర్కొన్నారు. నిబద్ధత కలిగిన కార్యకర్తగా సాంస్కృతిక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినట్లు గుర్తుచేశారు. సంతాప సభలో శ్రీనివాసరాజు మిత్రులు, సన్నిహితులు, ఎక్స్‌రే కార్యవర్గ సభ్యులు సీహెచ్‌వీ సుబ్బయ్య, రవికిరణ్, నాట్యాచార్యులు హేమంత్, స్వతంత్ర్యభారతి రమేష్ శ్రీనివాసరాజుతో అనుబంధాన్ని గుర్తు చేస్తున్నారు. శ్రీనివాసరాజు స్మృతికి కొద్దిసేపు మౌనం ప్రకటించారు.

నేడు ట్రాఫిక్ ఆంక్షలు

విజయవాడస్పోర్ట్స్: గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విజయవాడ నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ టి.కె. రాణా తెలిపారు. ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో జరిగే ఈ వేడుకల్లో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పలువురు మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు పాల్గొంటారన్నారు. ఈ నేపథ్యంలో బెంజిసర్కిల్ నుంచి డీసీపీ బంగ్లా, రెడ్‌సర్కిల్ నుంచి ఆర్టీఏ జంక్షన్, శిఖామణి సెంటర్ నుంచి వెటర్నరి జంక్షన్ వరకు కేవలం ఆహ్వానితులను మాత్రమే అనుమతిస్తామని, ఇతర వాహనాలను అనుమతించమని స్పష్టం చేశారు.

వాహనాల దారి మళ్లింపు ఇలా..

- ఆర్టీసీ వై.జంక్షన్ నుంచి బెంజిసర్కిల్‌కు స్వర్ణప్యాలెస్, దీప్తిసెంటర్, పుష్పాహోటల్, జమ్మిచెట్టుసెంటర్, సిద్ధార్థ జంక్షన్ మీదుగా ఒక మార్గంగా, బందరు లాకులు, రాఘవయ్యపార్క్, అమెరికల్ ఆసుపత్రి, నేతాజీబ్రిడ్జి, స్క్యూబ్రిడ్జి మీదుగా మరో మార్గంగా రాకపోకలు సాగించాలి.
- ఆర్టీసీ బస్సులు ఆర్టీసీ వై.జంక్షన్ నుంచి ఏలూరు రోడ్డు, ఐదో నెంబర్ రూట్ మీదుగా మాత్రమే రాకపోకలు సాగించాలి.

పార్కింగ్ ప్రదేశాలు..

- ఏఏ పాస్‌లు కలిగిన వారు మూడో నెంబర్ గేట్ నుంచి, ఏ1 పాస్‌లు కలిగిన వారు నాల్గో నెంబర్ గేటు నుంచి, బీ1 పాస్‌లు కలిగిన వారు ఆరో నెంబర్ గేటు నుంచి, ఐఏఎస్ అధికారులు, మీడియా ప్రతినిధులు రెండో నెంబర్ గేటు ద్వారా స్టేడియంలోకి ప్రవేశించి నిర్దేశించిన ప్రదేశాల్లో వాహనాలు పార్కింగ్ చేసుకోవాలి.
- నున్న, సింగ్‌నగర్, సత్యనారాయణపురం, మాచవరం వైపు నుంచి వచ్చే విద్యార్థులను తీసుకొచ్చే బస్సులు రెడ్‌సర్కిల్ వద్దనున్న బిషప్ అజరయ్య స్కూల్‌లో పార్కింగ్ చేసుకోవాలి.
- పటమట వైపు నుంచి విద్యార్థులను తీసుకొచ్చే బస్సులు.. విద్యార్థులను స్టేడియం వద్ద దింపి బస్సులను సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో పార్కింగ్ చేసుకోవాలి.

వైభవంగా సత్యనారాయణస్వామి వ్రతాలు



సత్యదేవుడి వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యాన మనగుడి, పుష్యమాస పౌర్ణమి సందర్భంగా పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపంలో గురువారం శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామి వ్రతాలు వైభవంగా జరిగాయి. సుమారు 70 జంటలు వ్రతంలో పాల్గొన్నారు. టీటీడీ వేదపండితుడు రొంపిచర్ల మురళీకృష్ణ అయ్యంగార్ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివార్లకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, మండపా రాధన, నవగ్రహ ఆవాహనతో కార్యక్రమాలను ప్రారంభించారు. రమాసత్యదేవుడి ప్రతిమకు వ్రత కార్యక్రమాన్ని నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో టీటీడీ అర్చక స్వాములు శశికిరణ్, టీటీడీ స్థానిక శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయాల టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బిర్లా వెంకటేశ్వర్లు, టీటీడీ అసిస్టెంట్ స్థపతి ఈవీ కృష్ణారావు, టాస్క్‌ఫోర్స్ ఏఈఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా హెల్త్ క్యాంపు

లబ్బీపేట(విజయవాడతూర్పు): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజాశక్తినగర్ రత్నమాంబ వీధిలోని మురళీకృష్ణ కేర్ అండ్ క్యూర్ హాస్పటల్‌లో శుక్రవారం మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించనున్నట్లు ఆస్పత్రి అధినేత జనరల్ ఫిజీషియన్ అండ్ డయాబెటాలజిస్ట్ డాక్టర్ టీవీ మురళీకృష్ణ తెలిపారు. ఈ క్యాంప్‌లో ఉచిత కన్సల్టేషన్‌తో పాటు మధుమేహం (ఆర్‌బీఎస్), కొలెస్ట్రాల్, థైరాయిడ్ (టీఎస్‌హెచ్), బ్లడ్ యూరియా, కిడ్నీ పరీక్ష, లివర్ పరీక్ష, ఇసీజీ వంటివి ఉచితంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ శిబిరంలో త్రినయన ఐ కేర్‌కు చెందిన డాక్టర్ సి.త్రివేణి పాల్గొని ఉచితంగా కంటి పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. అంతేకాకుండా రాయితీపై టోటల్ బాడీ చెకప్‌కు సంబంధించి ప్రత్యేక ప్యాకేజీ పరీక్షలు చేయనున్నట్లు వెల్లడించారు. ల్యాబ్‌లో కూడా 50 శాతం వరకూ రాయితీ ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే వారు 7981643518 నంబర్లో సంప్రదించాలని కోరారు.

వివాహిత ఆత్మహత్య

పాయకాపురం(విజయవాడరూరల్): వాంబే కాలనీలో ఇంట్లో ఉరివేసుకుని వివాహిత మృతి చెందడంతో గురువారం పోలీసులు అనుమానాస్పద కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. మృతురాలు గర్రె తేజశ్రీ(23)కి ఆంధ్రప్రభ కాలనీకి చెందిన గర్రె వెంకటేష్‌బాబుతో 2021వ సంవత్సరంలో వివాహం జరిగింది. వీరికి ఏడాదిన్నర వయస్సు గల బాబు ఉన్నాడు. ప్రైవేట్ సంస్థలో మెకానికల్ ఇంజినీరుగా పనిచేస్తున్న వెంకటేష్‌బాబు నాలుగు రోజుల క్రితం డ్యూటీ పని మీద క్యాంపు వెళ్లాడు. ఈ నెల 23వ తేదీన తేజశ్రీ వాంబేకాలనీ ఎ బ్లాక్‌లో ఉండే తల్లి దేవి దగ్గరకు వచ్చింది. 24న వెంకటేష్ దేవి కుమారుడికి ఫోన్ చేసి తన ఇంటి తాళం, తేజశ్రీ దగ్గర ఉన్న ఫోన్ గాయత్రి రెసిడెన్సీ వాచ్‌మెన్‌కు ఇవ్వాలని చెప్పాడు. దీంతో ఇంటితాళం, ఫోను వాచ్‌మెన్‌కు ఇచ్చాడు. అదే రోజు సాయంత్రం తేజశ్రీ ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఇంటికి వచ్చిన దేవికి తలుపులు వేసి ఉండటం గమనించి కిటికీలో నుంచి చూడగా కూతురు ఉరి వేసుకుని కనిపించింది. స్థానికుల సాయంతో తలుపులు తీసి చూడగా అప్పటికే తేజశ్రీ మృతి చెందినది. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బైక్ ఢీకొని యువకుడికి గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బైక్ ఢీకొని యువకుడికి గాయాలైన ఘటన కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నాలుగు స్తంభాల సెంటర్‌కు చెందిన మద్దినేని పవన్‌కుమార్ డెలివరీ కంపెనీలో పని చేస్తుంటాడు. బుధవారం సాయంత్రం సింగ్‌నగర్‌లో తెలిసిన వ్యక్తి ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా ఇన్నర్ రింగ్‌లోని ఆల్పా హోటల్ వద్ద వేగంగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. దీంతో పవన్‌కుమార్‌కు గాయాలు కాగా భవానీపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పద్యనాటక వైభవాన్ని చాటిన సత్యహరిశ్చంద్రీయం



అడవి ఘట్టంలోని హరిశ్చంద్రుడు, చంద్రమతి, బండి సదాశివరావు

విజయవాడ కల్చరల్: దేవికా నాట్యమండలి, గుమ్మడి జయరాజ్ కళాపీఠం, శ్రీ శ్రీ శ్రీ అంకమ్మతల్లి నాట్యమండలి ఆధ్వర్యాన కుమ్మరి నాగేశ్వరరావు పర్యవేక్షణలో గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదిక మీద గురువారం బలిజేపల్లి లక్ష్మీకాంతకవి రచించిన సత్యహరిశ్చంద్రీయ నాటకంలోని అడవి, కాటి సీను ఘట్టాలను కళాకారులు అద్భుతంగా ప్రదర్శించారు. హరిశ్చంద్రుడిగా జూనియర్ డీవీ, నక్షత్రకుడిగా బండి సదాశివరావు, చంద్రమతిగా అడపా ప్రభావతి, లోహితుడిగా తరుణ్ నటించారు. కుమ్మరి నాగేశ్వరరావు, శేఖర్, రామకృష్ణ వాద్య సహకారం అందించారు. రంగస్థల ప్రముఖులు గుమ్మడి విజయ్‌కుమార్, గుమ్మడి జీవన్‌కుమార్, అగురు త్రినాథనాయుడు పాల్గొన్నారు.

ప్రజల గడప వద్దకు పాలన

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రభుత్వ పాలనను ప్రజల గడప వద్దకే తీసుకువచ్చిన గొప్ప సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ అన్నారు. గడప గడపకు మన వెలంపల్లి శ్రీనివాస్ పేరుతో చేపట్టిన కార్యక్రమం 58వ డివిజన్ ఆంధ్రప్రభకాలనీలో గురువారం జరిగింది. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి కనకదుర్గానగర్, ఆంధ్రప్రభకాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి స్థానిక ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి, కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, ఉమ్మడి వెంకట్రావ్, శోభన్, జలసూత్రం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు 'ఆడుదాం ఆంధ్రా' మంచి అవకాశం



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలోని క్రీడాకారులలో ప్రతిభను వెలికి తీసేందుకు 'ఆడుదాం ఆంధ్రా' మంచి వేదికగా మారిందని ఏపీ ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ఆడుదాం ఆంధ్రాలో నియోజకవర్గ స్థాయిలో గెలుపొందిన విజేతలకు సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య మున్సిపల్ స్టేడియంలో గురువారం బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. క్రీడల ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించాలన్నదే ఆడుదాం ఆంధ్రా కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. అనంతరం క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏసీపీ మోహన్‌బాబు, సీడీఓ జగదీశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

28న చిత్రకళా ప్రదర్శన, చిత్రలేఖనం పోటీలు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సునీల్‌కుమార్ తదితరులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): నగరానికి చెందిన సీనియర్ చిత్రకారుడు, చిత్రకళా తపస్వి వేముల కామేశ్వరరావు శత వసంతాల సందర్భంగా ఈ నెల 28వ తేదీన గవర్నర్‌పేటలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో చిత్రకళా ప్రదర్శన, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ అధ్యక్షుడు ఎ.సునీల్‌కుమార్ తెలిపారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో గురువారం చిత్రకళా ప్రదర్శన, చిత్రలేఖనం పోటీలకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, జాషువా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో కామేశ్వరరావు గీసిన చిత్ర కళాప్రదర్శన, 1వ తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆదివారం ఉదయం 10.30 గంటలకు చిత్రకళా ప్రదర్శనను యువజన సంక్షేమ శాఖాధికారి యు.శ్రీనివాసరావు ప్రారంభిస్తారని తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి సాయంత్రం విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ ఉపాధ్యక్షుడు గిరిధర్ అరసవల్లి, జాషువా సాంస్కృతిక వేదిక ప్రధాన కార్యదర్శి గుండు నారాయణరావు, సంధ్యారాణి, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓటుతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ

డెప్యూటీ కమిషనర్ డి.వెంకటలక్ష్మి



మాట్లాడుతున్న డెప్యూటీ కమిషనర్ వెంకటలక్ష్మి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధ్యాపకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఓటు హక్కుపై యువత చైతన్యవంతం కావాలని అప్పుడే ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమని నగర పాలక సంస్థ డెప్యూటీ కమిషనర్ డి.వెంకటలక్ష్మి అన్నారు. కేబీఎన్ కళాశాల జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) విభాగాల ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటలక్ష్మి మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు చాలా ప్రధానమైన పాత్ర పోషిస్తుందని చెప్పారు. మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకోవడానికి ఓటు ఆయుధంగా ఉంటుందని పేర్కొన్నారు. దేశంలో వివిధ స్థాయిల్లో జరిగే ఎన్నికలను భారత ఎన్నికల కమిషన్ నిర్వహిస్తుందని పేర్కొన్నారు. ఓటు హక్కును తెలియజేసేందుకు, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఓటరు దినోత్సవాన్ని పెద్ద ఎత్తున దేశ వ్యాప్తంగా నిర్వహిస్తుందన్నారు. ఓటు విశిష్టతను విద్యార్థులు తమ చుట్టూ ఉన్న ప్రజలకు తెలియజేసి వారిని జాగృతం చేయాలని కోరారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థ యావత్ ఓటుపై ఆధారపడి ఉంటుందన్నారు. మంచి పాలకులను ఎన్నుకొని తద్వారా మంచి అభివృద్ధిని సాధించేందుకు ఓటు హక్కును చక్కగా వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ఎక్కువ పర్యాయాలు ఓటు వేసిన సీనియర్ సిటిజన్, కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కృష్ణమూర్తిని సత్కరించారు. కొత్తగా ఓటు నమోదైన వారికి ఐడీకార్డును అందించారు. ఈ సభలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ప్రోగ్రామ్ ఆఫీసర్ వి.శేషగిరిరావు స్వాగతం పలకగా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డి.పవన్‌కుమార్, ఎన్.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు అవసరం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజాస్వామ్య విజయానికి ఓటు హక్కు చాలా అవసరమని మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె భాగ్యలక్ష్మి అన్నారు. కళాశాలలో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమం రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ దేవరకొండ బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యాన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె ఓటు హక్కు ఆవశ్యకత, ప్రాముఖ్యతను వివరించారు. ఓటు హక్కు వజ్రాయుధమని, యువత ఓటు ప్రాధాన్యత గుర్తుంచాలని సూచించారు. యువత ఎన్నికల్లో తప్పనిసరిగా భాగస్వామ్యం కావాలని డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం కోరారు. అనంతరం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డాక్టర్ పద్మనాభం, డాక్టర్ సుకుమార్, డాక్టర్ శ్రీచరిత, డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

టోల్ ప్లాజా వద్ద తనిఖీల్లో రూ.4.10 లక్షల స్వాధీనం

ఉంగుటూరు: ఎటువంటి ఆధారాలు లేని రూ.4.10 లక్షల నగదును తీసుకువెళ్తున్న నలుగురు వ్యక్తులను ఆత్కూరు పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గన్నవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య నేతృత్వంలో హనుమాన్ జంక్షన్ సీఐ ఎ.నవీన్ నరసింహమూర్తి ఆదేశాల మేరకు ఎస్ఐ సూర్యశ్రీనివాస్ తన సిబ్బందితో పొట్టిపాడు టోల్ ప్లాజా వద్ద వాహన తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో పిడుగురాళ్ల నుంచి రావులపాలెం వెళ్తున్న కారులో రూ.4,10,000 నగదును గుర్తించారు. సరైన పత్రాలు చూపకపోవడంతో స్టేషన్‌కు తరలించి నగదును స్వాధీనపరచుకుని సీజ్ చేశారు.